క్లుప్తంగా

'జీతాలు ఇచ్చి.. ఆదుకోండి'



నిరసన వ్యక్తంచేస్తున్న కార్మికులు

దౌల్తాబాద్: ఐదు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. పని చేస్తున్నా.. చేతిలో పైసలు లేక.. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అప్పు చేసి కనీస అవసరాలు తీర్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి జీతాలు ఇచ్చి తమను ఆదుకోవాలని కోరారు.

టీయూడబ్ల్యూజే కార్యదర్శులకు సన్మానం



సన్మానిస్తున్న శ్రీనివాసాచారి

తాండూరు టౌన్: టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన విరాసత్ అలీ, ప్రధాన కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి వెంకట్‌రెడ్డిలను జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పకీరప్పలు గురువారం పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఖమ్మంలో కొనసాగుతున్న ఐజేయూ రాష్ట్ర మహాసభలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచారి మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కీలకమైన ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులు దక్కడం అభినందనీయమన్నారు. కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేస్తామని ఆయన చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ రాంరెడ్డి తదితరులు

కొడంగల్ రూరల్: ప్రస్తుత కాలంలో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని ఎంఈఓ రాంరెడ్డి అన్నారు. గురువారం పట్టణ శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఆయన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. పీడబ్ల్యూసీ ఇండియా ఫౌండేషన్ సభ్యులు లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో విద్యాలయానికి 10కంప్యూటర్లు, అందుకు అవసరమయ్యే సామగ్రితో పాటు ఒక ల్యాప్‌టాప్‌లను వితరణ చేయడం హర్షణీయమన్నారు. క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు ఎంఈఓ సూచించారు. ఇందులో ఫౌండేషన్ డైరెక్టర్ రమా, ట్రైనర్ మౌనిక, విద్యాలయ ప్రత్యేక అధికారి స్రవంతి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీజులను నియంత్రించండి



ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూరు రూరల్: ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. ఫీజుల నియంత్రణలో విద్యాధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. తాండూరు పట్టణంలోని విజయవిద్యాలయ స్కూల్లో ఇంగ్లిష్ మీడియం, ప్లే స్కూల్ పర్మిషన్‌ను రద్దు చేయాలని కోరారు. అనంతరం ఇందులో ప్రజా సంఘాల నాయకులు అరుణ్, రాజు, దీపక్ ఉన్నారు.

నేడు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

అనంతగిరి: ఆయిల్ పామ్ పంటల సాగుపై శుక్రవారం తాండూర్‌లోని బాలాజీ టెంపుల్ ఏసీ ఫంక్షన్ హాల్‌లో ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ, ఇకో పామ్ ఆయిల్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో రైతులకు అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఎంఏ.సత్తార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇందులో ఉన్నతస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారని, కావున రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎరువుల కొరత.. కర్షకుల కలత

పూర్తిస్థాయిలో అందక రైతుల పాట్లు
- సీజన్ మరూ అయినా.. దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు
- పట్టించుకోని వ్యవసాయ అధికారులు



తట్టెపల్లి పీఏసీఎస్ ఎదుట ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

పెద్దేముల్: వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు వారాలు గడిచినప్పటికీ.. కర్షకుల ఎరువుల కష్టాలు తీరడం లేదు. పూర్తి స్థాయిలో ఎరువులు అందక కలత చెందుతున్నారు. గురువారం పెద్దేముల్ మండలం తట్టెపల్లి పీఏసీఎస్ ఎదుట ఎరువుల కోసం రైతులు బారులు తీరారు. అయినా అవసరం మేరకు లభించకపోవడంతో నిరాశకు గురయ్యారు. ఇదే విషయాన్ని వ్యవసాయ అధికారులకు తెలిసినా, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఏటేటా ఇవే కష్టాలు

ఫర్టిలైజర్ దుకాణ దారులు ఇష్టం వచ్చిన ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని పలువురు రైతులు ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఒక్క రుపాయి కూడా అధిక ధరకు అమ్మరాదని ఆదేశించినా.. వ్యాపారులు బేఖాతరు చేస్తున్నారని వాపోయారు. తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువుల విక్రయాలు జరిగినా.. స్టాక్ అందుబాటులో లేక అరకొరే ఇస్తున్నారని చెప్పారు. ఏటా ఇవే కష్టాలు ఎదురువుతున్నా.. ప్రభుత్వం ఎరువుల సమస్య తీర్చడం లేదని గాజీపూర్, మంబాపూర్, రుద్రారం, బుద్దారం, నాగులపల్లి, జనగాం తదితర గ్రామాల రైతులు వెల్లడించారు.

సోదాలతో సరి..

ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయ అధికారులు తనిఖీల పేరిట స్టాక్ రిజిస్టర్లు పరిశీలిస్తున్నారే తప్పా.. ఎరువులు, పత్తి విత్తనాలు వ్యాపారులు ఏ ధరకు విక్రయిస్తున్నారని తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదని అన్నదాతలు ఆరోపించారు. మార్కెట్లో 45 కిలోల యూరియా బస్తాను రూ.270, డీఏపీ రూ.1,350కి విక్రయించాలన్న ఆదేశాలున్నా.. వ్యాపారులు రూ.320 నుంచి రూ.330లకు, డీఏపీ రూ.1,450 వరకు అమ్ముతున్నారని రైతులు పేర్కొంటున్నారు. ఆసాముల పేరుతో ఎరువులను దాచేస్తూ.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారని తెలిపారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని చెప్పారు. ఏఓ నజీరొద్దీన్ ఎక్కడ ఉంటారో కూడా తమకు తెలియదని రైతులు స్పష్టంచేస్తున్నారు. ఇదే అంశంపై ఏఓను వివరణ కోరేందుకు యత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

ఎకరాకు ఐదు సంచులు ఇవ్వాలి



ఆరు ఎకరాలకు ఆరు సంచుల యూరియా ఇస్తే ఏం చేయాలి. ఏ పంటకు ఎంత వేయాలి. మా గోడు ఎవరికి చెప్పినా లాభం లేదు. ఏటా ఇదే సమస్య. ప్రభుత్వం రైతులకు అవసరం ఉన్నంత ఎరువులు పంపిణీ చేయాలి. మిగతా భూమి కోసం కర్ణాటక రాష్ట్రం కుంచారంకు వెళ్లి యూరియాను ఖరీదు చేయవలసి వస్తోంది. ఎకరాకు ఐదు బస్తాలు అందచేయాలి.

\- సత్యమ్మ, రైతు, తట్టెపల్లి

300 టన్నులు పంపిణీ చేశాం



తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 600 టన్నుల యూరియా, 100 టన్నుల డీఏపీ అవసరం ఉంది. ఇప్పటి వరకు 300 టన్నుల యూరియా, 50 టన్నుల డీఏపీ రైతులకు అందచేశాం. ఇంకా 300 టన్నుల యూరియా, డీఏపీ త్వరలో రానుంది. ఒక పట్టా పాసుబుక్‌కు 6 సంచుల చొప్పున యూరియాను రైతులకు అందచేస్తున్నాం. అయినా చాలడం లేదంటున్నారు. -రాజమౌళి, సీఈఓ, తట్టెపల్లి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- వ్యాధుల నియంత్రణకు దోహదం
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

దుద్యాల్: 'ప్రపంచానికి దేశం అందించిన అద్భుతాల్లో ఒకటి యోగా. మనిషి మానసిక ప్రశాంతతకు, శారీరక దారుఢ్యానికి, ఆరోగ్యానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. మనస్సు, శరీరాన్ని ఏకం చేసి, ఆధ్యాత్మికతను యోగా అందిస్తుంది' అని యోగా నిపుణులు స్పష్టంచేస్తున్నారు. శుక్రవారం యోగా ప్రపంచ దినోత్సవం సందర్భంగా వారు మాట్లాడారు. వేదకాలం నుంచే దేశంలో యోగా ఉందని చెప్పారు. యోగా చేసేవారు క్రమశిక్షణతో కూడిన జీవనం గడుపుతారని తెలిపారు. నిత్యం తెల్లవారు జామునే నిద్రలేవడం, గంట పాటు యోగాసానాలు వేయడంతో వారి దినచర్య ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆధునిక జీవితంలో అధికులు శారీరక వ్యాయామం లేక అనేక వ్యాధుల బారిన పడుతున్నారని, వాటి బారిన పడకుండా ఉండేందుకు యోగా చేయడానికి చాలా మంది ఉత్సాహం చూపుతున్నారని వెల్లడించారు.



దుద్యాల్: పద్మాసనంలో విద్యార్థులు

వ్యాధుల నియంత్రణ

యోగా ద్వారా నిత్యం ఆరోగ్యంగా ఉంటారని, బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె జబ్బులు, అస్తమా, గ్యాస్ట్రబుల్, సయాటికా, వెన్నునొప్పి, మోకాళ్లనొప్పి, మలబద్ధకం, స్థూలకాయం వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని యోగా గురువులు స్పష్టంచేస్తున్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

అనంతగిరి: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా గురువు నారాయణ రాథోడ్ అన్నారు. నేటి యోగా డేను పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగాను జీవితంలో ఒక భాగం చేసుకోవాలని సూచించారు. మానసిక, శారీరక ఒత్తిడి తగ్గాలంటే తప్పకుండా యోగాసనాలు చేయాలని చెప్పారు. అలా చేయడం వలన.. ఆహ్లాదకరంగా, ఉల్లాసంగా ఉంటామని పేర్కొన్నారు. ఇందులో రైల్వే ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి బాలజీ, కమిటీ సభ్యులు పాండు నాయక్, అనంతయ్య రూప్‌సింగ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కుల్కచర్ల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ సత్యహరిశ్చంద్ర అధ్యక్షతన జరగనున్న సమీక్షకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, జడ్పీటీసీ రాందాస్ నాయక్‌లు రానున్నారని తెలిపారు. మండల పరిధి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీఓ వెల్లడించారు.

ఆ పాఠశాలలపై చర్యలు

కొడంగల్/బొంరాస్‌పేట: నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ రాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొడంగల్, బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని పాఠశాలలకు నోటీసులు పంపినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు లోబడి ఫీజులు వసూలు చేయాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్, ఏకరూప దుస్తులు, నోటుపుస్తకాలు తదితర సామగ్రిని పాఠశాలల్లో విక్రయించరాదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టంచేశారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ఎదిగే పిల్లలకు దివ్య ఔషధం
- ఆరోగ్య సమస్యలకు చెక్
- జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు



తాండూరు టౌన్: బాలికకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కౌన్సిలర్ సంగీతా ఠాకూర్

పిల్లల కడుపులో నులిపురుగులు చేరితే.. రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. వీటికి నివారణగా వైద్యుల సూచనల మేరకు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి' అని ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జాతీయ నులిపురుగు దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాలోని పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.

తాండూరు రూరల్: విద్యార్థుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని జినుగుర్తి పీహెచ్‌సీ డాక్టర్ రశీద్ అన్నారు. మండల పరిధి జినుగుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులిపురుగు నివారణ (అల్బెండజోల్) మాత్రలు వేశారు. అనంతరం మాట్లాడారు. 3 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర, రెండేళ్లలోపు వారికి అర మాత్ర వేయాలని సూచించారు. మాత్రలు వేయడం వలన కడుపులోని చెడు.. మలమూత్రం ద్వారా బయటకు వస్తుందని తెలిపారు. కడుపునొప్పి తగ్గుతుందన్నారు. ఇందులో హెచ్ఎం మృత్యుంజయస్వామి, సూపర్‌వైజర్ నీలమ్మ, సీహెచ్ఓ నర్సమ్మ, ఏఎన్ఎం కరుణశ్రీ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విరేచనాలు రక్తహీనత..

తాండూరు టౌన్: ఆరు నెలలకు ఒకసారి పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలని మున్సిపల్ 20వ వార్డు కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ సూచించారు. వార్డు పరిధి అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నులిపురుగులు కడుపులో ఉండటం వలన కడుపు నొప్పి, అజీర్ణం, తలనొప్పి, విరేచనాలు, రక్తహీనత, బలహీనత, ఆకలి మందగించడం వంటి వ్యాధి లక్షణాలు పెరుగుతాయని, వీటి నివారణ కోసం ప్రభుత్వం ఏటా రెండుసార్లు మాత్రలను పంపిణీ చేస్తుందని తెలిపారు. విధిగా పిల్లలకు మాత్రలను వేసి, వ్యాధుల నుంచి రక్షించాలన్నారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలు మాధవి, అంగన్‌వాడీ టీచర్ రాధ, పాఠశాల చైర్ పర్సన్ లలిత, ఆర్పీ శోభ, ఏఎన్ఎం శాంత, ఆశ వర్కర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవడం వలన చిన్నారుల్లో ఎదుగుదల లోపించదని తెలిపారు. ఇందులో మండల వైద్యాధికారి వాజుద్దీన్, ఎంఈఓ హబీబ్ అహ్మద్, సీహెచ్ఓ చంద్రప్రకాశ్ ఉన్నారు.

ఏటా రెండు సార్లు..

యాలాల: ఎదిగే పిల్లలకు నులిపురుగు నివారణ మాత్ర(అల్బెండజోల్) ఒక శక్తి లాంటిదని ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూషతో కలిసి విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. ఏటా రెండు సార్లు నివారణ దినోత్సవం జరుగుతుందని, మొదటి విడతలో మాత్రలు తీసుకోని వారు రెండో విడతలో తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఇందులో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, సీహెచ్ఓ చంద్రశేఖర్ ఉన్నారు.



మండల కేంద్రంలో మాత్రలు వేస్తున్న ఎంపీపీ తదితరులు

నులిపురుగులు చనిపోయి..

దౌల్తాబాద్: అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం వలన పిల్లల కడుపులోని నులిపురుగులు చనిపోయి, రక్తహీనత నుంచి బయట పడతారని వైద్యాధికారి సౌమ్య అన్నారు. నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మాత్రలు పంపిణీ చేసినట్లు ఆమె వెల్లడించారు. ఇందులో సూపర్‌వైజర్ రఫీ, పల్లె దవాఖాన వైద్యాధికారి రామకృష్ణ తదితరులు ఉన్నారు.



కుల్కచర్ల: మాత్రలు వేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ



దౌల్తాబాద్‌లో మాత్రలు వేస్తున్న వైద్యసిబ్బంది



బంట్వారం: కోట్‌పల్లిలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న చంద్రప్ప



బొంరాస్‌పేటలో..



దోమ: కస్తుర్బాగాంధీ పాఠశాలలో మండల వైద్యాధికారి రజిత

చివరి ఆయకట్టుకు నీరందిస్తాం

- రైతులకు సాగునీటి కష్టాలను తీరుస్తాం
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- రూ.2.75 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గోట్లపల్లి గురుకుల పాఠశాలలో ల్యాబ్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్: కోట్‌పల్లి ప్రాజెక్టును అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు.. చివరి ఆయకట్టు వరకు నీరందించి, రైతుల సాగునీటి కష్టాలను తీర్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధి గోట్లపల్లి, మారేపల్లి, పెద్దేముల్ గ్రామాల్లో రూ.2.75 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో బీఎమ్మార్ మాట్లాడారు. ప్రాజెక్టును గత ప్రభుత్వం పట్టించుకోలేదని, పదేళ్ల పాలనలో చిల్లిగవ్వ నిధులు జలాశయ అభివృద్ధికి వెచ్చించక పోవడం సిగ్గు చేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తమ ప్రభుత్వం జిల్లాలోని కోట్‌పల్లి, జుంటుపల్లి, శివసాగర్‌తో పాటు పలు ప్రాజెక్టుల వృద్ధికి నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

9,600 ఎకరాల ఆయకట్టుకు

రైతులకు సాగు నీటికి ఇబ్బంది కలగకుండా.. కోట్‌పల్లి ప్రాజెక్టు కింద ఉన్న 9,600 ఎకరాల ఆయకట్టుకు నీరేందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి తొలి ప్రాధాన్యత ఇస్తుందని, సర్కారు పాఠశాలలను బలోపేతం చేయడానికి అమ్మ ఆదర్శ పథకం కింద కోటాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి జిల్లా మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, జడ్పీటీసీ ధారాసింగ్, ఎంపీటీసీ సభ్యురాలు లోంకనీలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ జితేందర్‌రెడ్డి, జిల్లా యువ నాయకుడు మైపాల్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు నజీర్, పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు నర్సింలు, నాయకులు మల్లేశం, ప్రవీణ్ కుమార్, ఎగ్బాల్, రియాజ్, నర్సింలు, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఓటీపీలు చెప్పి మోసపోవద్దు: పోలీసులు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తాండూరు టౌన్: సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అన్నారు. గురువారం పట్టణంలోని పలు కూడళ్లలో పోలీసు సిబ్బంది ప్రజలకు సైబర్ మోసగాళ్ల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సైబర్ దొంగలు బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును అపహరించేందుకు రకరకాలుగా యత్నిస్తుంటారని తెలిపారు. బ్యాంకు అధికారుల్లాగే ఫోన్ చేసి ఓటీపీ చెప్పాలని కోరతారని, అలా చెప్పినట్లయితే.. నగదు ఖాళీ అవుతుందని చెప్పారు. ఏ బ్యాంకు అధికారులు కూడా నేరుగా ఖాతాదారుడికి ఫోన్ చేసి, వివరాలు అడగరని స్పష్టంచేశారు. నగదు ట్రాన్స్‌ఫర్ విషయంలో అప్రమత్తత పాటించాలని సూచించారు. ఎవరి చేతిలోనైనా మోసపోయామని గ్రహిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సమయపాలన లేకుంటే.. జీతం కట్



ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు, హెచ్ఎం

మండల విద్యాధికారి వెంకటయ్య

పెద్దేముల్: ఉపాధ్యాయులు సమయ పాలన పాటించకుంటే జీతాల్లో కోత విధించడమే కాకుండా.. తగిన చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి వెంకటయ్య హెచ్చరించారు. పెద్దేముల్ మండలం నాగులపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం వజీర్‌తో పాటు ఐదు మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. గురువారం ఉదయం 9గంటలకు జరిగిన ప్రార్థనలో విద్యార్థులు, హెచ్ఎం మినహా మరో ఉపాధ్యాయుడు పాల్గొనలేదు. ఇదే విషయమై హెచ్ఎం వజీర్‌ను వివరణ కోరగా.. ఆటోల్లో వస్తున్నారని సమాధానం చెప్పారు. అనంతరం 9.15 గంటలకు ఒకరి తరువాత ఒకరు విధులకు హాజరయ్యారు. ఉపాధ్యాయుల సమయ పాలన గురించి మండల విద్యాధికారి వెంకటయ్యను వివరణ కోరగా.. పై విధంగా స్పందించారు. మండలంలోని పాఠశాలల్లో ఏ ఉపాధ్యాయుడు సమయపాలన పాటించకపోయినా చర్యలు తప్పవని స్పష్టంచేశారు.

సరుకులు లేవు.. బువ్వ లేదు

పెద్దేముల్: 'నూనెలేదు. కారంలేదు. అందుకే వంట చేయలేదు' అని అంగన్‌వాడీ టీచర్ జ్యోతి తెలిపారు. మండల పరిధి జైరాంతండా(తట్టిపల్లి) అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం మధ్యాహ్నం 12గంటలకు 'సాక్షి' విజిట్ చేయగా.. విద్యార్థులు ఎవరూ లేరు. టీచర్‌ను వివరణ కోరగా.. సరుకులు లేక భోజనం వండలేదని, పిల్లలు వారివారి ఇళ్లకు వెళ్లారని తెలిపారు. ఇదే అంశంపై సూపర్‌వైజర్ మీనాక్షిని వివరణ కోరగా.. ఆ కేంద్రంలో సరుకులు లేకపోతే, ఇతర సెంటర్ల నుంచి తెచ్చి భోజనం వడ్డించాలి. చిన్నారులకు భోజనం పెట్టకపోవడం సరికాదన్నారు. వేరే సెంటర్ల నుంచి సామగ్రి తెచ్చి, వంట చేయడం తరుచూ జరుగుతుంటుందని చెప్పారు. విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అనంతగిరి: మున్సిపల్ రెవిన్యూ విభాగంలో విధులు నిర్వహిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కోరారు. గురువారం కార్యాలయంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. చాలీ చాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామని బిల్‌కలెక్టర్లు పేర్కొన్నారు. వేతనాలు పెంచడంతో పాటు రెగ్యులరైజ్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఉద్యోగులు కోరారు. చందర్‌సింగ్, సోమయ్య, జగదీష్, అరుణ్, అశోక్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

పాస్‌పుస్తకాలు ఇవ్వండి

బొంరాస్‌పేట: ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు డిజిటల్ పాస్‌పుస్తకాలు ఇచ్చి, పట్టా కల్పించాలని కొత్తూరు అసైన్డ్ భూముల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ తహసీల్దార్ రవికి వినతిపత్రం అందజేశారు. పట్టా కల్పించడంతో పాటు కింద మైదన రైతుల పేర్లను సరిచేయాలని కోరారు. లేని పక్షంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

భగీరథ సర్వే పూర్తి

పెద్దేముల్: మిషన్ భగీరథ ఇంటింటి సర్వే గురువారం నాటికి 8,220 కనెక్షన్లపై పూర్తయిందని మండల ఇన్‌చార్జి ఎంపీఓ రమేష్ తెలిపారు. పాషాపూర్, పెద్దేముల్, బుద్దారం, గాజీపూర్ గ్రామాల్లో రమేష్, కార్యదర్శులు సర్వే చేశారు. అనంతరం ఎంపీఓ మాట్లాడారు. మండలంలో 10,069 నల్లా కనెక్షన్లు ఉన్నాయని, మిగతావి మూడు రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు.